


# సఫారీ వేళ.. పులితో జాగ్రత్త!

- అప్రమత్తంగా వ్యవహరిస్తే.. ప్రమాదం లేనట్టే
- ఏటీఆర్ సఫారీ పునఃప్రారంభం
- పర్యాటకులకు అటవీ అధికారుల అవగాహన

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : సఫారీ సమయంలో పులులు, ఇతర వన్యప్రాణులు అకస్మాత్తుగా ఎదురైనప్పుడు పర్యాటకులు చాకచక్యంగా వ్యవహరించాలని అటవీ అధికారులు సూచించారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు. జంతువుల సంతతి కోసం మూడు నెలల విరామం తర్వాత అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) సఫారీ తిరిగి ఆదివారం పునఃప్రారంభమైంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో పులులు జనసంచారంలోకి రావడం, తిరుపతిలో చిరుతలు చిన్నారులపై దాడులు చేసిన ఘటనలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ సఫారీ సందర్భంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించింది. ఏటీఆర్‌లో సఫారీ ఫరహాబాద్ ద్వారం నుంచి జంగల్ ప్రారంభమై, నల్లమల్ల అడవుల్లోని వృక్ష, జంతుజాలం గురించి పర్యాటకులకు వివరిస్తూ ముందుకు సాగనున్నదని అధికారులు పేర్కొన్నారు. పర్యాటకులకు పలు జంతువుల గురించి, వాటి బారినపడకుండా తప్పించుకొనే మార్గాలపై అవగాహన కల్పించారు. ఉద్దేశ పూర్వకంగా ఏ జంతువు అడవి నుండి బయటకు రాదని, అడవిలో మనుషుల ప్రమేయం పెరగడం, బయటి ప్రాంత ఒత్తిడి వల్లే ఇలా జరుగుతుందని ఫారెస్ట్ సీనియర్ అధికారి మాధవ్‌రావు వివరించారు. ముఖాముఖిగా ఎదురుపడితే దాడి చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. అలాంటి సందర్భంలో రెండు చేతులు పైకి లేపి గట్టిగా అరవాలని, అప్పుడు తనకంటే ఎక్కువ ఎత్తు ఉన్న జంతువు ఉందన్న భ్రమలో పక్కకు పోయే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. చిరుతపులి విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తిరిగి పరుగెత్తడం, లేదా పొదల చాటున దాక్కునే ప్రయత్నం చేయొద్దని సూచించారు. పారిపోతే అటాక్ చేస్తుందని కూడా కచ్చితంగా చెప్పలేమని, అయితే , అది దాడి చేయాలని నిర్ణయించుకున్న సందర్భంలో ఎంత పరుగెత్తినా దాని వేగం ముందు నిలవలేమని మాధవ్‌రావు వివరించారు.

### తెలంగాణలో 21 పులులు

నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) స్టేటస్ టైగర్స్ కో–ప్రెడేటర్స్ అండ్ ప్రే ఇన్ ఇండియా– 2022 నివేదిక ప్రకారం తెలంగాణలో 21 పులులు ఉన్నాయని, ఇవి ప్రధానంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్(ఏటీఆర్)లో ఉన్నాయని ఏటీఆర్ అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు. 2018 జనాభా లెక్కల ప్రకారం.. ఏటీఆర్‌లో14 పులులు ఉన్నాయన్నారు. అది ప్రస్తుతం 21కి పెరిగిందని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్(ఎన్ఎస్‌టీఆర్)వైపు ఏటీఆర్ నుండి చాలా పులుత వలసలు కొనసాగుతున్నాయని చెప్పారు.

# తిసభ్య కమిటీ సమావేశం రేపటికి వాయిదా

హైదరాబాద్, అక్టోబర్4 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం గురువారం జరుగాల్సి ఉండగా, రేపటి (శుక్రవారం)కి వాయిదా పడింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేఆర్ఎంబీ లేఖలు రాసింది. ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి అంశంపై త్రిసభ్య సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 6న సమావేశాన్ని నిర్వహించనున్నట్టు బోర్డు వెల్లడించింది. ఇరు రాష్ట్రాలు గడచిన ఐదేండ్లలో ఉమ్మడి రిజర్వాయర్లలో ఆవిరి నష్టాలకు సంబంధించిన డేటాను అందించాలని సూచించింది.

# సర్కారు ఖర్చులతో మోదీ రాజకీయాలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల పేరిట ప్రభుత్వ ఖర్చుతో వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయాలు మాట్లాడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ విమర్శించారు. హడావుడిగా పాత అభివృద్ధి పనులను మోదీ ప్రారంభిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మలతో కలిసి మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. బీజేపీ అంతిమ దశలో ఉందని, పసుపుబోర్డు ప్రకటన చనిపోయే ముందు తులసీ తీర్థం పోసినట్టు ఉందని ఎద్దేవా చేశారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే దేశం ఉత్తరభారత్, దక్షిణ భారత్‌గా విడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

# పుట్టిన రోజే యువకుడి దుర్మరణం

- ఒకే బైక్‌పై ఐదుగురు ప్రయాణం
- మరో నలుగురికి గాయాలు

మొయినాబాద్, అక్టోబర్ 4: పుట్టిన రోజు నే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందాడు. స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకునేందుకు ఒకే బైక్‌పై ఐదుగురు ప్రయాణిస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు మీద పడిపోయారు. దీంతో ఐదుగురిలో పుట్టిన రోజు ఉన్న యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. కర్ణాటక యాద్గిర్ జిల్లా గుర్మిట్కల్ మండలం చెంద్రికి చెందిన రాఘవేంద్ర(18) పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులు తిమ్మప్ప, నరేష్, శ్రీనివాస్, వీరేష్ కలిసి వేడుక లు నిర్వహించేందుకు ఒకే బైక్‌పై వెళ్తున్నారు. తోలుకట్టా గేట్ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో అందరికీ గాయాలయ్యాయి. ఇందులో రాఘవేంద్ర తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.

# అడవిలా ఆయిల్‌పాం తోటలు

- రాష్ట్రంలో మరో అటవీ ప్రాంతం సృష్టి!
- పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర
- ఎక్కువ కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి అధిక మొత్తంలో ఆక్సిజన్ విడుదల
- ఆయిల్‌పాం తోటలు ఉన్నచోట వర్షాలు అధికంగా కురిసే అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో బహుముఖ లాభాలు



హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాధారణ అటవీ ప్రాంతానికి తోడుగా మరో కొత్త అటవీ ప్రాంతం అభివృద్ధి చెందుతున్నది! రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మిషన్ ఆయిల్‌పాం' పథకం ఈ కొత్త అడవిని సృష్టిస్తున్నది. ఇది చదువుతున్నప్పుడు ఆయిల్‌పాం సాగుకు, అటవీ అభివృద్ధికి సంబంధమేమిటి? అనే ప్రశ్న తలెత్తడం సహజం. కానీ, ఈ రెండింటికీ సంబంధం ఉన్నది. పర్యావరణానికి అడవులు ఎంత ముఖ్యమో.. ఆయిల్‌పాం చెట్లకూ అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యం ఉన్నది. సాధారణ చెట్లతో పోల్చితే ఆయిల్‌పాం చెట్లు పర్యావరణానికి ఎక్కువ మేలు చేస్తాయని పలు పరిశోధనల్లో తేలింది. అందుకే ఆయిల్‌పాం చెట్లను 'పర్యావరణ ఊపిరితిత్తులు' (లంగ్స్ ఆఫ్ ఎకోసిస్టమ్)గా పిలుస్తారు.

### అధిక ఆక్సిజన్ విడుదల

ఎక్కువ కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి అధిక ఆక్సిజన్‌ను ఇచ్చే చెట్టును పర్యావరణ కోణంలో మంచి చెట్టుగా పరిగణిస్తారు. సాధారణ చెట్లతో పోల్చితే ఆయిల్‌పాం చెట్లు ఎక్కువ కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి, అధిక మొత్తంలో ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. పలు దేశాల్లో జరిగిన పరిశోధనల ప్రకారం.. సాధారణ చెట్లతో కూడిన అటవీ ప్రాంతం సంవత్సరానికి హెక్టారుకు 42.4 టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహిస్తుంది. అంతే విస్తీర్ణంలోని ఆయిల్‌పాం చెట్లు 64.5 టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహిస్తాయి. సాధారణ అటవీ ప్రాంతంతో పోల్చితే ఆయిల్‌పాం చెట్లతో కూడిన ప్రాంతం 22.1 టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను అధికంగా స్వీకరించడం గమనార్హం. సాధారణ అటవీ ప్రాంతం సంవత్సరానికి హెక్టారుకు 7.09 టన్నుల ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. ఆయిల్‌పాం సాగు ప్రాంతం 18.70 టన్నుల ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. సాధారణ అటవీ ప్రాంతంతో పోల్చితే ఆయిల్‌పాం చెట్లతో కూడిన ప్రాంతం 11.61 టన్నుల ఆక్సిజన్‌ను అధికంగా విడుదల చేస్తున్నది. ఈవిధంగా అధిక కార్బన్‌డయాక్సైడ్‌ను స్వీకరించి, అధిక ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు ఆయిల్‌పాం చెట్లు దోహదపడుతున్నాయి. అంతేకాదు, పలు పంటల సాగుతో పోల్చితే ఆయిల్‌పాం సాగుకు తక్కువ నీరు, తక్కువ ఎరువులు అవసరం. ఒక ఎకరం వరి సాగు కోసం అవసరమయ్యే సాగునీటితో నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయొచ్చు. వరదల సమయంలో నేలలోని మృత్తికలు కొట్టుకుపోకుండా కాపాడుతాయి. ఆయిల్‌పాం సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురుస్తాయని పరిశోధనలో తేలింది.

### 1.60 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం అడవి

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నది. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటివరకు సుమారు 1.60 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగైంది. ఈ లెక్కన రాష్ట్రంలో 1.60 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం అడవి అభివృద్ధి చెందినట్టయ్యింది. ఆయిల్‌పాం సాగుతో రైతులకు లాభసాటి పంట అందుబాటులోకి రావడంతో పాటు పర్యావరణానికీ మేలు జరుగుతున్నది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం పర్యావరణాన్ని రక్షించేందుకు హరితహారం పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నది. ఇప్పటికే 290 కోట్లకు పైగా మొక్కలు నాటించింది. దీంతో పాటు రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరుతో పచ్చదనం పెంపుదలకు కృషి చేస్తున్నారు. ఈవిధంగా దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం అకుంఠిత దీక్షతో పని చేస్తుండటం విశేషం.

హెక్టార్ విస్తీర్ణంలోని సాధారణ అటవీ ప్రాంతం గ్రహించే కార్బన్‌డయాక్సైడ్ **42.4 టన్నులు**

హెక్టార్ విస్తీర్ణంలోని ఆయిల్‌పాం చెట్లు గ్రహించే కార్బన్‌డయాక్సైడ్ **64.5 టన్నులు**

హెక్టార్ విస్తీర్ణంలోని సాధారణ అటవీ ప్రాంతం విడుదల చేసే ఆక్సిజన్ **7.09 టన్నులు**

హెక్టార్ విస్తీర్ణంలోని ఆయిల్‌పాం చెట్లు విడుదల చేసే ఆక్సిజన్ **18.70 టన్నులు**

# శిశువును వదులుకున్న పేగుబంధం



చెట్ల పొదల్లో పడి ఉన్న పసికందు

### పసికందును కాపాడిన పోలీసులు

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 4: అప్పుడే పుట్టిన ఆడ శిశువును చెట్లపొదల్లో విసిరేసి పేగుబంధాన్ని వదులుకున్నది ఓ మూర్ఖురాలు. ఈ అమానవీయ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండలం పాత్రపురంలో బుధవారం వెలుగుచూసింది. కనురెప్పలు తెరువకముందే పసికందును కడతేర్చాలని చెట్లపొదల్లో విసిరేసిన దారుణం స్థానికులను కలచివేసింది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శిశువును స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యం చేయించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం దవాఖానకు తరలించగా శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పాత్రపురం శివారులోని చెట్లపొదల్లో పసికందు ఏడుపును గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో.. వారు వెంటనే స్పందించి శిశువు ప్రాణాలు కాపాడారు. పుట్టిన బిడ్డ ఆడపిల్ల అనే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. కాగా శిశువును పొదల్లో పారేసిన వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.